క్లుప్తంగా

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



కారెంపూడి : స్థానికి వీర్ల అంకాలమ్మ గుడి సెంటర్‌లోని సాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబావారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు దిలీప్‌కుమార్ నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. వందలాదిగా భక్తులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు వివిధ రకాల అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు విష్ణు సహస్ర నామ పారాయణం, సాయి చాలీసా పారాయణం పఠించారు. బాబాకు పల్లకి సేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

దాచేపల్లి సీఐగా సురేంద్రబాబు



దాచేపల్లి : దాచేపల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఎ. సురేంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు వన్‌టౌన్ నుంచి బదిలీ ఆయన ఇక్కడకు వచ్చారు. సీఐగా బాధ్యతలు చేపట్టిన సురేంద్రబాబును ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జీ. సంధ్యారాణి, స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని, సమస్యలపై ప్రజలు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేయవచ్చునని సీఐ సురేంద్రబాబు చెప్పారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన షేక్ బిలాలుద్దీన్‌కు పోస్టింగ్ ఇవ్వలేదు.

పేదలకు అన్నదానం



పిడుగురాళ్ల: పేదలకు అన్నదానం వంటి కార్యక్రమాలు చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని తంగుటూరి వెంకట సుబ్బారావు చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గుంటూరు బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా అన్నదానం ఎంతో గొప్పదని, ఆకలి అని వచ్చిన నిరుపేదలకు కడుపునింపడం ఎంతో చెప్పుకోదగిన విషయమని ఆయన అన్నారు. ట్రస్టు సభ్యులు సతీష్ మాట్లాడుతూ ప్రతి సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీను, సతీష్, కృష్ణ, గురవయ్య, గుండా నారాయణ, కొత్త కాశీ విశ్వనాథం, కోడూరు శంకర్, ఆతుకూరి వాసు, మణి, గంగాధర్ ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం



మాచర్ల రూరల్: పేద, మధ్య తరగతి విద్యనందించే ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం సర్పంచ్ నోముల కృష్ణ రూ. 20 వేల విలువైన మధ్యాహ్న భోజన పథకానికి వంట పాత్రలు అందజేయడం అభినందనీయమని హెచ్‌ఎం ఐవి నాగమణికి అన్నారు. సోమవారం మండలంలోని కొప్పునూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకానికి రూ. 20వేల విలువగల వంట పాత్రలు అందించడం అభినందనీయం అన్నారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులు భాగస్వాములు కావడం సంతోషకరమని, పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి సొంత డబ్బులతో సౌకర్యాలు కల్పిస్తున్న గ్రామస్తుల సేవలను మరువలేమన్నారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెల పెంపకం దారు సంఘం అధ్యక్షుడు బూడిద సైదులు, ఉపాధ్యాయులు పాల్ రాజు, శ్రీనునాయక్, అప్పారావు, టీ శ్రీనివాసరావు, మోహన్, ప్రసాద్, అలివేలమ్మ, అన్నపూర్ణ తదితరులున్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

వినుకొండ(నూజెండ్ల): ఐసీడీఎస్ వినుకొండ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎం.అనురాధ తెలిపారు. వినుకొండ మున్సిపాలిటీ హనుమాన్‌నగర్ (బీసీ–ఈ), వినుకొండ రూరల్ మండలంలోని కొప్పుకొండ ఓసీ–1 (జనరల్), గోకనకొండ–2 (జనరల్), శావల్యాపురం మండలం కొత్తలూరు తుమ్మలకుంట (ఎస్సీ) సెంటర్లలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన 21 నుంచి 35 సంవత్సరాల వయసు గల వివాహితులై ఉండాలని, అభ్యర్థి స్థానికంగా నివాసం ఉండాలన్నారు. సంబంధిత పత్రాలతో ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేద వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) ప్రజలకు వివరించారు. కారెంపూడిలో 12వ రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి ఎమ్మెల్యే పీఆర్కే నిర్వహించారు. గ్రామానికి దక్షిణం వైపున్న వడియరాజుల గడ్డలో గడప గడపకు ఎమ్మెల్యే పీఆర్కే పర్యటించారు. పార్టీ నాయకులతో ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు చేకూర్చిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. లబ్ధిదారుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల వల్ల తమ కుటుంబాల ఇబ్బందులు చాలా వరకు తొలగిపోయాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పీఆర్కే పట్ల ప్రజలు ఆదరణ చూపారు. మళ్లీ మీరే గెలవాలని ఎమ్మెల్యే పీఆర్కేను ప్రజలు ఆశీర్వదించారు. అమ్మఒడి పథకం చాలా బాగుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో పిల్లలను బడికి పంపడానికి పెద్దగా ఆసక్తి చూపలేదని ఇప్పుడు పిల్లలను సంతోషంగా బడికి పంపుతున్నామని తల్లులు పీఆర్కే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. ఏడాదికి రూ.15 వేలు అందుతున్నాయని ఆ డబ్బును పిల్లల ఉన్నత చదువుల కోసం దాస్తున్నామని కొందరు తల్లులు తెలిపారు. పాఠశాలలో కూడా చదువు బాగా చెబుతున్నారని మధ్యాహ్న భోజనం బాగా ఉంటోందని పిల్లలు చెబుతున్నారని తల్లులు పేర్కొన్నారు. తమ పిల్లలు కూడా చక్కగా యూనిఫాం వేసుకుని సూటుబూటుతో దర్జాగా స్కూలుకు వెళ్తుంటే తమకు ఆనందంగా ఉందని తల్లులు తెలిపారు. వైఎస్సార్ ఆసరా, చేదోడు, జగనన్న వసతి, విద్యా దీవెనలు, సున్నా వడ్డీ, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ చేయూత పథకాల వల్ల ప్రయోజనం పొందామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. వడ్డెర్ల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే పీఆర్కే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తమ గడపకు వచ్చిన ఎమ్మెల్యే పీఆర్కేకు ప్రజలు సాదరస్వాగతం పలికి శాలువాలు, పూలమాలలతో సన్మానించి ప్రభుత్వం అందిస్తున్న సేవలపై కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి శ్రీనివాసయాదవ్, సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు వివిధ శాఖల అధికారులు గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, మండల పార్టీ కార్యదర్శి పాతూరి రామిరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, కరాలపాటి సుబ్బారావు, ట్రస్టు బోర్డ్ చైర్మన్ చల్లా ప్రసాద్, ఎంపీటీసీ వేముల లింగయ్య, కొమెర పిచ్చెయ్య, బత్తుల బైరాగివర్మ, బత్తుల రాముడు, కొమెర కొండ, వల్లెపు ఏడుకొండలు, పెదవెంకటేశ్వర్లు, బత్తుల కోటేశ్వరరావు (సెంట్రింగ్), బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ప్రభుత్వ విప్ పీఆర్కేను సత్కరిస్తున్న ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మాచర్ల: పట్టణ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం పట్టణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శీలం మల్లారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ పీఆర్కేని నూతన కార్యవర్గం ఎంపిక అభినందనీయమన్నారు. ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం అమ్మి రైతుల జీవితాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రభుత్వ విప్ పీఆర్కేను నూతన కార్యవర్గ సభ్యులు, అసోసియేషన్ నాయకులు పిన్నెల్లి హనిమిరెడ్డి, మేడం శివరామకృష్ణ, యరబోతుల కోటేశ్వరరావు, పోలా సత్యనారాయణ, కొత్త శ్రీను, మారం శ్రీను, విడేల శ్రీనివాసరావు, కాసుల వెంకటేశ్వర్లు, పుల్లారావు, శ్రీరామమూర్తి, చెన్నా, మహేష్, వెంకటేశ్వర్లు, విడేల కృష్ణమూర్తి, కజ్జం గురవయ్య, గాలేశ్వరరావు, తదితరులు అభినందించి పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించారు.

పల్లె పల్లెకు వైఎస్సార్ కంటి వెలుగు

పిడుగురాళ్లరూరల్: కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పిడుగురాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు కె. ప్రభావతి, ఏ. రమాదేవిలు అన్నారు. మండలంలోని జూలకల్లు గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పీ.ఎం.వో.ఏ సాంబశివరావు గ్రామంలో 60 సంవత్సరాలు పై బడిన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఫ్రీగా కళ్లజోళ్లు అందిస్తామని తెలియజేశారు. కంటి సమస్య ఎక్కువగా ఉన్న వారికి ఆపరేషన్ అవసరమైన వారికి ఏరియా హాస్పటల్‌కు రిఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ కంటి వైద్య శిబిరంలో 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎస్. అశ్విని, ఏఎన్‌ఎంలు శ్రీలక్ష్మీ, వెంకట్రావమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకు వైఎస్సార్ జలకళ



వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా బోరును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో సాగునీరుకు ఇబ్బంది పడుతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు వైఎస్సార్ జలకళ ద్వారా రైతులందరికీ ఉచితంగా బోరు, మోటారు, విద్యుత్‌ను అందజేస్తున్నామని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొప్పునూరు గ్రామ పంచాయతీ, హసనాబాద్ తండాలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా బోరును ప్రారంభించి ఆయన మాట్లాడారు. సన్న, చిన్నకారు రైతులు సాగునీరు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న ఇబ్బందులను గుర్తించి సీఎం జగన్ వైఎస్సార్ జలకళ పథకాన్ని తీసుకొచ్చి 2.5 నుంచి 5 ఎకరాలలోపు రైతులకు ఉచితంగా బోరు వేసి, మోటారు బిగించి, విద్యుత్ కనెక్షన్ అందించి రైతన్నలను ఆదుకుంటున్న గొప్ప నాయకుడు మన ముఖ్యమంత్రి అన్నారు. జలకళ ద్వారా పల్నాటి ప్రాంతంలోనే అత్యధికంగా బోర్లను వేయిస్తున్నట్లు చెప్పారు. రైతన్నల కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌కు మనందరం అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మండ్లి పెదమల్లుస్వామి, సర్పంచ్‌లు నోముల కృష్ణ, ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, వెంకట్రావు, బుడ్డా రఘు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాద కుటుంబానికి రూ. 50వేలు అందజేత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వ విప్ పీఆర్కే రూ. 50వేల నగదును అందజేశారు. వారి కుటుంబసభ్యులకు తాను అండగా ఉంటానని, వారికి ఎటువంటి సహాయ సహకారాలందించాలన్నా అండగా ఉంటానన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓ బాధ్యతల స్వీకారం

బొల్లాపల్లి: ఈఓపీఆర్‌డీ షేక్ జిలానీ బాషా మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (పూర్తి అదనపు బాధ్యతలు) సోమవారం చేపట్టారు. గతంలో ఇన్‌చార్జిగా వ్యవహరించిన టి.పార్వతి వట్టిచెరుకూరు మండలం బదిలీ అయ్యారు. నూజెండ్ల మండలం ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న జిలానీ బాషా బొల్లాపల్లికి బదిలీపై వచ్చారు. రెంటచింతల మండలం నుంచి ఎంపీడీఓగా బదిలీపై వచ్చిన గౌసియా బేగం సెలవుపై వెళ్లడంతో ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టినట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు.

23 నుంచి దేవాలయ భూములకు వేలం

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పలు దేవాలయాలకు సంబంధించిన భూములకు ఈ నెల 23 నుంచి బహిరంగ వేలం పాటలను సత్తెనపల్లి ఇన్స్‌పెక్టర్ వి.లీలావతి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి సోమవారం తెలిపారు. ఆశక్తి గల వారు ఈ వేలం పాటలో రూ.2 వేలు చెల్లించి పాల్గొనాలని కోరారు. పాట పాడినవారికి వెంటనే కౌలు పూర్తిగా చెల్లించి రసీదు పొందవలసి ఉంటుందన్నారు. ఈ నెల 23న రెంటాల గ్రామంలో గం.11లకు 62.30ఎకరాలకు, మధ్యాహ్నం 1గంటలకు రెంటచింతల గ్రామంలో 129.09 ఎకరాలకు, మధ్యాహ్నం గం.2లకు మిట్టగుడిపాడు గ్రామంలో 19 ఎకరాలకు, 24న ఉదయం 11గం.లకు గోలి గ్రామంలో 6.88 ఎకరాలకు, మధ్యాహ్నం గం.12లకు జెట్టిపాలెం గ్రామంలో 3ఎకరాలకు, మధ్యాహ్నం గం.2లకు మల్లవరం గ్రామంలో 18 ఎకరాలకు మధ్యాహ్నం గం.3లకు తుమ్మకోట గ్రామంలో 47.62 ఎకరాలకు మొత్తం 278.89 ఎకరాలకు ఈ బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సత్రశాలలో ప్రత్యేక పూజలు



సత్రశాల(రెంటచింతల): మండలంలోని ప్రముఖశైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లన్నస్వామి దేవస్థానంలో ఆషాడ మాసం ప్రారంభం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మల్లిఖార్జున స్వామి వారిని, భ్రమరాంబికా దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో వేకువజాము నుంచే పలు పూజా కార్యక్రమాలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దేవస్థానానికి సమీపంలోని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలను ఆచరించి మల్లన్నస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దాచేపల్లి-2ఎంఈఓగా పినకపాని

దాచేపల్లి : దాచేపల్లి–2 ఎంఈఓగా ఎం. పినకపాని సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. మండలాన్ని విద్యా పరంగా అభివృద్ధి చేస్తామని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ–2 పినకపాని చెప్పారు. ఎంఈఓ–2గా బాధ్యతలు చేపట్టిన పినకపానిని సీఆర్పీలు అబ్రహాం, వెంకటేశ్, చంద్రమోహన్, కార్యాలయం సిబ్బంది జమల్, విజయ, పలు ఉపాధ్యాయ యూనియన్ నాయకులు సన్మానించారు.

డొంక రోడ్లకు మహర్దశ

- ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు సహకారంతో పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, గ్రామస్తులు



నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో నేడు చేసిన పంట కాలువ పనులు



ఎంపీ , రైతుల సహకారంతో ఏర్పాటు చేసుకున్న డొంక రోడ్డు

గురజాల : గ్రామీణ ప్రాంతాల రహదారులకు మహర్దశ పట్టింది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు ప్రత్యేక చొరవతో డొంక రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. రైతులు పలు మార్లు వారు పడే ఇబ్బందులను ఎంపీ లావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి వారి సమస్యకు పరిష్కారం చూపేవిధంగా చర్యలు చేపట్టారు. ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే రైతులు ఇబ్బందులను పరిష్కరించేందుకు పలు చర్యలు తీసుకున్నారు. డొంక రహదారుల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించే పనిలో ఉన్నారు. వర్షాకాలంలో రైతులు పొలం వెళ్లడానికి దారి మార్గం లేకపోవడంతో ఇబ్బందులు పడతారని గుర్తించి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తన సొంత నిధులతో మండలాల్లో గల గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు పొక్లెయిన్‌ను పంపించి డొంక దారులు శుభ్రం చేసి రైతులకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు.

రైతుల సహకారంతో పూర్తి....

ఎంపీ, రైతుల సహకారంతో డొంక రోడ్ల అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తున్నారు. రోడ్ల అభివృద్ధికి కావల్సిన మిషనరీని ఎంపీ సమకూర్చగా వాటికి అయ్యే పై ఖర్చులను రైతులు పెట్టుకుంటున్నారు. రోలర్లు, టిప్పర్లు, జెసిబి, క్రేన్‌లు ఏర్పాటు చేయగా వాటికి మిగులు అయ్యే ఖర్చులను రైతులు భరాయించే విధంగా చర్యలు చేపట్టారు. అందుబాటులో ఉన్న గ్రావెల్‌ను వినియోగించుకుంటూ పనులు చేపడుతున్నారు.

9 గ్రామాల్లో పూర్తి ...

నియోజకవర్గంలోని 9 గ్రామాల్లో ఇప్పటికి పొలానికి వెళ్లే బాటలు, డొంక రోడ్ల పనులు పూర్తయ్యాయి. దాచేపల్లి మండలంలోని ముత్యాలంపాడు, మాదినపాడు, కేసానుపల్లి, రామాపురం, గామాలపాడు గ్రామాల్లో 11 రోడ్లకు గాను 24 కిలోమీటర్లు, పిడుగురాళ్ల మండలంలో గుత్తికొండలో 3 రోడ్లు 3 కిలోమీటర్లు, మాచవరం మండలంలోని వేమవరం మండలంలో 3రోడ్లు 8 కిలోమీటర్లు, గురజాల మండలంలోని మాడుగుల, జంగమహేశ్వరపురంలో 3 రోడ్లు 5 కిలోమీటర్లు, కాగా 4కిలోమీటర్లు పొడవునా కాలువ కట్ట పనులు పూర్తి చేయడం జరిగింది.

ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని పనులు పూర్తి

రైతుల వద్ద నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో వుంచుకుని డొంక రోడ్ల అభివృద్ధి చేయడం జరుగుతుంది. రైతుల సహకారంతో పనులు చేపడుతున్నాం. రైతులు ఇబ్బందులు పడుతున్నారని నా దృష్టికి రావడంతో వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా ఖరీఫ్ సీజన్ పూర్తి కావాలనే ఆలోచనతో ముందస్తుగా చర్యలు చేపట్టాం. వీలైనన్ని గ్రామాల్లో పొలాలకు వెళ్లే రోడ్లు అభివృద్ధి చేయాలన్నదే సంకల్పం.

– ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకూ సంక్షేమంతో పాటు, గ్రామాల అభివృద్ధిని అందించిన ఘనత వైఎస్సార్ సీపీ అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. గ్రామంలో సుమారు రూ.18 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ నవరత్నాల సుమారు రూ.లక్ష వరకు లబ్ధి చేకూరిందన్నారు. నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, జరిగిన మంచిని వివరించేందుకే ధైర్యంగా గడప గడపకు వెళ్తున్నామని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండే విధంగా గ్రామ సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను, వెల్‌నెస్ సెంటర్లను నిర్మించి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లచే క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందించామన్నారు. త్వరలోనే గ్రామంలో ప్రతి ఇంటికీ మంచి నీరు అందించేందుకు జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విపక్ష టీడీపీ విమర్శలు చేస్తుందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కార్యక్రమాలను కాపీ కొడుతూ అమలు కానీ మేనిఫెస్టోను విడుదల చేసి, ప్రజల ముందు నవ్వుల పాలయిందని విమర్శించారు.

టీడీపీ నేతలకు బుద్ధిచెప్పాలి..

టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్ని చెప్పినా ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. చంద్రబాబు పాలనలో డ్వాక్రా మహిళలను మోసం చేసారని, అందుకే మహిళలు బుద్ధి చెప్పారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి కనుకనే మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పల్లెనిద్ర, గ్రామ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. లోకేష్ లోకజ్ఞానం లేని నాయకుడని, చేస్తున్న పాదయాత్రకు రోజు రోజుకూ ఆదరణ తగ్గుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన నిలబడాలని కోరారు. చంద్రబాబుకు ఓటు వేస్తే కరువు, వివక్ష, స్వార్థపాలన మరలా రాష్ట్రంలో వస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీలను నవరత్నాల ద్వారా నెరవేర్చాం, అందుకే ధైర్యంగా ప్రతి గడపకూ వెళ్లి ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఏం కావాలో అడిగి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, గ్రామ సర్పంచ్ భవనగిరి కృష్ణవేణి నరసింహ, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మారం బ్రహ్మారెడ్డి , ఎంపీటీసీ మంగి మంగమ్మ శివరామయ్య, వైస్ ఎంపీపీలు నన్నే, లక్ష్మయ్య, మండల యూత్ కన్వీనర్ మద్దు ప్రసాద్, మాజీ యూత్ కన్వీనర్ జిలుగు వెంకట నరసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్లు వివేకానందరెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, వీర్నాల బాలకోటేశ్వరావు, జంగమయ్య, ఎంపీడీఓ ప్రసాదు, తహసీల్దారు ప్రసాద్, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఈఏ సురేష్, గ్రామ నాయకులు బాదం ప్రసాదరెడ్డి , ప్రతాప్‌రెడ్డి పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు దేశానికే ఆదర్శం

ఎంపీపీ చౌడేశ్వరి



విద్యార్థులకు నగదు,మెడల్‌ను అందజేస్తున్న ఎంపీపీ చౌడేశ్వరి



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న చిన్న ఆంజనేయులురెడ్డి

రెంటచింతల: చదువుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ అందజేస్తున్న జగనన్న ఆణిముత్యాలు దేశానికే ఆదర్శమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం రెంటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, స్థానిక ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో 10వ తరగతిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కింద నగదు బహుమతి, మెడల్ అందించి సీఎం జగన్ తన మంచి మనస్సును చాటుకున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె కోరారు. విద్యార్థి క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఆ విద్యార్థి ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా అభివృద్ధి చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నో పథకాలను అమలుచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఐ. వెంకటేశ్వర్లు, ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు ఆణిముత్యాలకు సన్మానం

పిడుగురాళ్లరూరల్: మండలంలోని పదిటివారిపాలెం గ్రామంలోని నంద్యాల ఆంజనేయులురెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల కింద విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి మొదటి బహుమతి అషరితరెడ్డి, రెండవ బహుమతి గ్రీష్మా అక్షయ్య, మూడవ బహుమతి బి. వైష్ణవిలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణయ్య, టి. రంగారెడ్డి, పి. సుధాకర్‌రెడ్డి, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్ద పీట



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

విజయపురిసౌత్: ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరావు అన్నారు. సోమవారం విజయపురి సౌత్‌లోని క్యాంప్–2 ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులను అభ్యసించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతుందన్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం మల్లిఖార్జునరావు ప్రభుత్వం విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్న అమ్మ ఒడి, నాడు–నేడు, డిజిటల్ క్లాస్ రూమ్స్, వసతి దీవెన అంశాలపై తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బీర్నీడి రమేష్, క్యాంప్–1 పాఠశాల చైర్మన్ ఎస్‌కె జిలానీ బాష, ఉపాధ్యాయులు కెవీ నారాయణ, మౌలాలి, జోత్స్న, రాజకుమారి, అశ్విని, అనూష పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ

కారెంపూడి: స్థానిక బ్రహ్మానాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక ప్రజా ప్రతినిధులు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసి, జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు సోమవారం పంపిణీ చేశారు. స్కూలు యూనిఫాం, బ్యాగ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ తదితర విద్యాకానుకలను పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రతిభ చూపిన అక్షయ్‌కుమార్, తండా షౌకత్, రమ్యకార్తీక్, సాయిరేఖలకు నగదు బహుమతులను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ షేక్ ఆరీఫ్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ ఆతుకూరి గోపి, ఎంపీటీసీలు బొమ్మిన అల్లయ్య, షేక్ ఆరీఫ్, హెచ్‌ఎం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఇన్‌చార్జి హెచ్‌ఎం మరియన్న మృతి

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసప్స్ ఉన్నత పాఠశాల విశ్రాంత ఇన్‌చార్జి హెచ్‌ఎం మాదాను లూర్దు మరియన్న (92)సోమవారం ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామంలో మృతి చెందారు. 1958 నుంచి 1988 వరకు పాఠశాలలో ఆయన ఇంగ్లిష్, గణిత ఉపాధ్యాయునిగా పనిచేశారు.